సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
శుక్రవారం । 8 । నవంబర్ । 2024



క్రికెట్ టోర్నీలో బ్యాట్స్‌మన్ జోరు
కడపలో నిర్వహిస్తున్న అండర్–14 క్రికెట్ పోటీల్లో బ్యాట్స్‌మన్ సత్తా చాటారు. గుంటూరు, అనంతపురం జట్ల మ్యాచ్‌లో గుంటూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. -8లో



తెల్లవారితే పెళ్లిరోజు..
తెల్లారితే ఆ దంపతుల పెళ్లి రోజు. ఈ నేపథ్యంలో పుట్టింటి నుంచి కొత్త దుస్తులు తీసుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.6/23.2

జిల్లాలో గురువారం 23.2 – 33.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

రెచ్చిపోయిన రెడ్డెమ్మ!

కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి హుందాతనం కోల్పోయారు. ఒక ప్రజాప్రతినిధిగా గౌరవంగా అడుగుపెట్టాల్సిన సభలో కౌరవ సేనతో వచ్చి సభా మర్యాదలను పట్టపగలే మంటగలిపారు. కుర్చీలాట ఆడనంటూనే కుర్చీ కోసం మారాం చేసి పరువు పోగొట్టుకున్నారు. వేదికపై సీటు ఎందుకు వేయలేదంటూ మేయర్‌నే గద్దిస్తూ మరో మెట్టుకు జారిపోయారు. తోటి కార్పొరేటర్‌ను ‘నువ్వు’ అంటూ ఏకవచనంతో సంభోదిస్తూ సంస్కారాన్ని కోల్పోయారు. ‘మహిళ’ అంటూనే ..తోటి మహిళలను కించపరుస్తూ మరింతగా దిగజారిపోయారు. గురువారం కడప నగర సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాధవి వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికే మాయని మచ్చగా మిగిలిపోనుంది.

హుందా.. అసలుందా..
- సొంత అజెండాతో రాద్ధాంతం సృష్టించిన కడప ఎమ్మెల్యే
- హోదా మర్చిపోయి డమ్మీగా మారిన కమిషనర్
- మేయర్ ఆదేశాలను అమలు చేస్తూ సభను ఆర్డర్‌లో పెట్టడంలో విఫలం



నగరపాలక సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలను పక్కనబెట్టి వ్యక్తిగత ఆరోపణలకు దిగిన ఎమ్మెల్యే మాధవిరెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: ఆమె ఎమ్మెల్యే. కడప నియోజకవర్గ ప్రజల ప్రజాప్రతినిధి. బాధ్యతగా వ్యవహరించి స్థానికంగా ఉన్న సమస్యలను మున్సిపల్ కౌన్సిల్‌లో పరిష్కరించేందుకు చొరవ చూపెట్టాలి. సాధ్యం కాని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కౌన్సిల్‌కు తోడ్పాటు ఇవ్వాలి. అలా వ్యవహరిస్తే మరింత పేరు లభించేది. కానీ ఆమె అందుకుభిన్నంగా ప్రదర్శించారు. కౌన్సిల్‌లో ఉన్న కార్పొరేటర్లంతా (ఒక్కరు మినహా) సమావేశం అజెండా కొనసాగించాలని కోరినా తాను పట్టిన కుందేలికి మూడే కాళ్లు అన్నట్లుగా వ్యవహరించారు. హుందాతనం మర్చిపోయి కార్పొరేటర్లతో గొడవకు దిగారు. మేయర్ ఛైర్‌కు తగ్గట్లుగా వేదికపై సీటు ఎందుకు వేయలేదంటూ నానా రభస చేశారు.

- మున్సిపల్ కార్పొరేషన్‌కు మేయర్ సుప్రీం. ప్రభుత్వ నిబంధనలు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఎమ్మెల్యే కేవలం కౌన్సిల్‌లో ఎక్స్‌అఫీషియో సభ్యురాలు మాత్రమే. కానీ ఎమ్మెల్యే మాధవి తీరు ‘అధికారం మాదే.. మా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తాం’ అన్నట్లు ఉంది. కార్పొరేషన్ సమావేశానికి వస్తున్న ఆమె వాహనానికి ముందు వైపు స్కూటర్ ర్యాలీతో పాటు వందలాది మంది అనుచరులతో ప్రాంగణానికి చేరుకుంది. పైగా వచ్చిన అనుచరులందరూ కార్పొరేషన్ కార్యాలయంలోకి పంపించాలని పోలీసులను పట్టుబట్టారు. కౌన్సిల్‌లోకి చేరకున్న అమె నేరుగా మేయర్ పోడియంపైకి వెళ్లి నిల్చొంది. అంతేనా మైకు తీసుకొని రాజకీయ ప్రసంగం మొదలుపెట్టారు. మేయర్‌పై వ్యక్తిగత ఆరోపణలు సంధించారు. సీటు మార్చడంపై మేయర్ ఛైర్ విచక్షణాధికారాన్ని సైతం ప్రశ్నించారు.

స్థాయి మర్చిపోయిన కమిషనర్....

కమిషనర్ మనోజ్‌రెడ్డి స్థాయి మర్చిపోయి కౌన్సిల్ మీట్‌లో ప్రవర్తించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. మేయర్‌తోపాటు కమిషనర్ తన సీటులో ఆశీనులై, ఛైర్ నుంచే ఆదేశాలు ఇవ్వాల్సింది పోయి, ఎమ్మెల్యే మాధవి రెడ్డి నిలబడితే, అక్కడికే వెళ్లి కమిషనర్ కూడా నిలుచుండిపోయారు. ఈ దృశ్యం అటు కార్పొరేటర్లకు, ఇటు మీడియా ప్రతినిధులకు వింతగా కన్పించింది. కౌన్సిల్‌లో మేయర్ ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత కమిషనర్‌ది. మేయర్ ఆదేశాలను సైతం అమలు చేయకపోగా తాను నిమిత్తమాత్రుడినే అన్నట్లుగా ఉండిపోయారు. తాత్కాలిక వాయిదా తర్వాత సమావేశం కొనసాగించాలని మేయర్ సురేష్‌బాబు ఆదేశించినా డీఎస్పీ శాంతిభద్రతలను కట్టడి చేయలేమంటున్నారని చెప్పుకురావడం గమనార్హం. 50మంది కార్పొరేటర్లతో నిర్వహిస్తున్న సమావేశంలో శాంతి భద్రతలు కట్టడి చేయలే మని డీఎస్పీ వెల్లడిస్తే, వెంటనే ఎస్పీ ఆపై అధికారులకు కమిషనర్ ఫిర్యాదు చేయాల్సిందిపోయి, డీఎస్పీ మాటలను మేయర్‌కు వివరిస్తూ పోస్టుమెన్ జాబ్ చేశారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



పోలీసులను తోసుకుంటూ వస్తున్న టీడీపీ కార్యకర్తలు

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..

తిరుపతి కార్పొరేషన్‌లో ఇలాంటి ఘటనే ఉత్పన్నం అయ్యింది. తిరుపతి ఎంపీ గురుమూర్తి మేయర్ శిరీషాతో పాటుగా వేదిక మీద ఆశీనులయ్యారు. స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరైన ఆ సమావేశంలో బీసీ మహిళ మేయర్‌గా ఉన్నారు. ఆమె గౌరవానికి భంగం లేకుండా మనమంతా సభ్యుల స్థానంలో ఆశీనులై అవసరమైన సలహాలు, సూచ నలు చేద్దామని చెప్పుకొచ్చారు. ఎంపీ సైతం ఎమ్మెల్యే అభ్యర్థనను మన్నించి సభ్యుల స్థానంలో ఎక్స్‌అఫిషియో మెంబర్ స్థానంలో కూర్చొండిపోయారు. అక్కడ అలా జరిగితే.. ఇక్కడేమో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాత్రం తనకు సీటు మేయర్ ఛైర్ స్థాయిలో ఎందుకు వేయలేదంటూ గొడవ సృష్టించారు. నిజానికి ప్రొటోకాల్ అలానే ఉంటే అధికార పార్టీ ఎమ్మెల్యేను విస్మరించే సాహసం అధికారులు చేసే అవకాశం ఉందా? స్థాయి దిగజారి ప్రవర్తించడం ఏమేరకు సబబు అని నగర ప్రజలు చర్చించుకుంటున్నారు. కేటాయించిన సీటులో కూర్చొని సమావేశం కొనసాగించి ఉంటే మరింత హుందాగా ఉండేదని విశ్లేషకులు సైతం వెల్లడిస్తున్నారు.

- ప్రజా సమస్యలను చర్చించాల్సిన చోటది... ప్రజాప్రతినిధిగా బాధ్యతగా మెలగాల్సిన వేదికది.. అలాంటి చోట మాధవిరెడ్డి అభాసుపాలయ్యారు. సభలో కమిషనర్ ఏదో చెప్పబోతుండగా కన్నుకొట్టి సైగ చేశారు. దీనిని బట్టి వ్యూహం ప్రకారమే రాద్ధాంతం చేసినట్లు అందరికీ స్పష్టమైంది.



ఎమ్మెల్యే మాధవి తీరుపై మహిళా కార్పొరేటర్ల ఆగ్రహం

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో టీడీపీ ఎమ్మెల్యే మాధవి వ్యవహరించిన తీరు, మాట్లాడిన విధానంపై వైఎస్‌ఆర్‌సీపీ మహిళా కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక మహిళగా ఉండి సాటి మహిళలని చూడకుండా అహంకారపూరితంగా మాట్లాడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అభిప్రాయాలు వారి మాటల్లోనే..

ఎమ్మెల్యేకేనా రక్షణా, మాకు లేదా?



ఎమ్మెల్యే మాధవి ఎన్నికల్లో విజయం సాధించి మొదటిసారి సర్వసభ్య సమావేశానికి వచ్చినపుడు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లమంతా ఆమెను సాదరంగా ఆహ్వానించాం. అయితే ఆ సమావేశంలోనే ఆమె మమ్మల్ని కించపరిచేలా మాట్లాడింది. ఆ సమావేశంలోకి టీడీపీ నాయకులు చొరబడి మా గొంతునొక్కేశారు. ఈ సమావేశానికి పోలీసులు మా గుర్తింపు కార్డులు చూసి, పూర్తిగా తనిఖీ చేశాకే లోనికి అనుమతించారు. కానీ 200 మందికి పైగా టీడీపీ కార్యకర్తలను ఎలా అనుమంతించారో అర్థం కావడం లేదు. ఆమెకేనా రక్షణా.... మాకు అవసరం లేదా?
– పత్తి రాజేశ్వరి, కో ఆప్షన్ సభ్యురాలు

దౌర్జన్యం చేయడం మంచిది కాదు



కూటమి ప్రభుత్వం వచ్చాక ఐదు నెలలుగా ఎమ్మెల్యే కడపలో ఏమేం చేస్తుందో అందరం చూస్తున్నాం. మా కార్పొరేటర్లపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. సమావేశానికి వచ్చి దౌర్జన్యంగా వ్యవహరిస్తోంది. మేం రక్షణ కావాలని ఎస్పీకి వినతిపత్రం ఇవ్వకూడదా...రవీంద్రనగర్ బ్రిడ్జికి టెంకాయ కొట్టి ఎన్నాళ్లవుతోంది. ఇంతవరకు బ్రిడ్జి నిర్మించారా? ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి.
– ముంతాజ్‌బేగం, డిప్యూటీ మేయర్, కడప

ఎమ్మెల్యేకు ఎంత గౌరవం ఇవ్వాలో అంతకంటే ఎక్కువే ఇచ్చాం



ఎమ్మెల్యే మాధవికి తాము ఎంత గౌరవం ఇవ్వాలో అంత కంటే ఎక్కువే ఇచ్చాం. మొదటి సమావేశంలో మేయర్‌తో పాటు కుర్చీ వేసి గౌరవించాం. కానీ ఆమె ఆ గౌరవాన్ని నిలబెట్టుకోలేక పోయారు. గొడవ చేయాలనే ఆమె సమావేశానికి వచ్చారు. మహిళా లోకం సిగ్గుపడేలా ఆమె ప్రవర్తన ఉంది. హుందాతనం మరిచి వ్యక్తిగత విమర్శలకు దిగడం భావ్యం కాదు.
– శ్రీలేఖ, కార్పొరేటర్

ఈమె ఇలా చేస్తుందని తెలిసే ఎస్పీకి విన్నవించాం



ఎమ్మెల్యే మాధవి ముందస్తు వ్యూహం ప్రకారం రెచ్చగొట్టేలా వ్యవహరించారు. రౌడీలు, గుండాలను వెంట తీసుకొచ్చారు. ఈ విషయమై మేము ఎస్పీకి ముందే ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎమ్మెల్యే ఎంత రెచ్చగొట్టినా మేము సంయమనంతో వ్యవహరించాం. మీకు రక్షణ ఎందుకని ఎమ్మెల్యే ప్రశ్నించడం సరైంది కాదు. – ఎంవీ శ్రీదేవి, కార్పొరేటర్.

కార్పొరేషన్‌పై ఎమ్మెల్యే మాధవి దండయాత్ర

- మందీ మార్బలంతో వచ్చి సర్వసభ్య సమావేశంలో రచ్చ...రచ్చ
- ఎజెండాపై చర్చించాలన్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
- వినిపించుకోని ఎమ్మెల్యే



టీడీపీ కార్యకర్తలతో కలిసి నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, టీడీపీ నేత శ్రీనివాసులరెడ్డి

కడప కార్పొరేషన్: కడప కార్పొరేషన్‌పై టీడీపీ ఎమ్మెల్యే మాధవి దండయాత్ర చేశారు. మందీ మార్బలంతో ర్యాలీగా వచ్చి సర్వసభ్య సమావేశంలో రచ్చ రచ్చ చేశారు. తన కుర్చీని మేయర్‌తో సమానంగా పైన వేయకుండా, కార్పొరేటర్లతోపాటు కింద వేసిన విషయాన్ని తెలుసుకున్న ఆమె.. ముందస్తు వ్యూహం ప్రకారం వందలాది మంది టీడీపీ కార్యకర్తలతో వచ్చి సర్వసభ్య సమావేశంలో రభస సృష్టించారు. సభ లోపలికి ప్రవేశించగానే ఆమెకు కేటాయించిన కుర్చీలో ఆశీనురాలు కాకుండా వేదికపైకెక్కి నిల్చొన్నారు. తనకు మాట్లాడేందుకు అవకాశమివ్వాలని మేయర్‌ను కోరగా ఆయన సమ్మతించారు. ఇదే అదనుగా భావించిన ఎమ్మెల్యే రాజకీయ విమర్శలతో పాటు వ్యక్తిగత విమర్శలకు దిగారు. దీంతో ఎజెండాపై చర్చించాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు అడ్డు తగిలారు. అయినా ఆమె వినిపించుకోలేదు... సబ్జెక్టు మీదే మాట్లాడాలని కార్పొరేటర్ ఆరీఫుల్లా బాషా చెప్పగా ‘నీవు కూర్చో...నేను మాట్లాడుతున్నా...నీకు అవకాశం ఇచ్చినప్పుడు మాట్లాడు’ అంటూ ఏకవచనంతో సంభోదించారు. ‘ప్రజలు నాకు అంతకంటే పెద్ద కుర్చీ ఇచ్చారు...మీకు పోలీస్ రక్షణ కావాలా...దేనికి’ అని వైఎస్సార్‌సీపీ మహిళా కార్పొరేటర్లనుద్దేశించి దురుసుగా ప్రశ్నించారు. ఈ క్రమంలో అరుపులు, కేకలతో సమావేశం గందరగోళంగా మారడంతో మేయర్ సురేష్ బాబు సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

చొరబడిన టీడీపీ శ్రేణులు

నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం సందర్భంగా కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు, మీడియా మినహా మరెవరినీ అనుమతించలేదు. గుర్తింపు కార్డులు చూపిన వారిని మాత్రమే లోనికి అనుమతించారు. ఎమ్మెల్యే రాకతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దాదాపు 50 మంది టీడీపీ కార్యకర్తలు సర్వసభ్య సమావేశం జరిగే హాలు ఎదుట ఉన్న మరో సమావేశ మందిరంలో తిష్టవేశారు. కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సుమారు 200 మంది గేట్లు తోసివేస్తూ మేయర్ డౌన్‌డౌన్ అంటూ రాద్ధాంతం చేశారు. వారిని పోలీసులు నియంత్రించలేకపోయారు. తమను గుర్తింపు కార్డులు చూపించాకే లోనికి అనుమతించిన పోలీసులు ఏ గుర్తింపు కార్డులు లేకుండా ఇంతమంది టీడీపీ కార్యకర్తలను ఎలా అనుమతించారని కార్పొరేటర్లు కమిషనర్‌ను ప్రశ్నించారు.

చేతులెత్తేసిన పోలీసులు

మళ్లీ సమావేశం నిర్వహించాలని మేయర్, కార్పొరేటర్లు నిర్ణయించినా భద్రతా కారణాలతో రక్షణ కల్పించలేమని పోలీసులు చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని మేయర్ సురేష్‌బాబు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతానికి వాయిదా వేయాలని కలెక్టర్ సూచించినట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ మేయర్, కార్పొరేటర్లు సభ వాయిదాకు అంగీకారం తెలిపారు.



మహిళా కార్పొరేటర్లను అడ్డుకుంటున్న టీడీపీలోకి జంప్ అయిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ కె. సూర్యనారాయణరావు



కార్పొరేషన్ కార్యాలయం వద్ద పోలీసుల బందోబస్తు

ఎమ్మెల్యేకు ఎంతో గౌరవం ఇచ్చాం

- ఆ గౌరవాన్ని ఆమె కాపాడుకోలేదు
- ఐదు నెలలుగా కక్ష సాధింపు చర్యలు చేపట్టారు
- అందుకే చట్ట ప్రకారం నడుచుకున్నాం
- నేనే రాజు, నేనే మంత్రిలా ఎమ్మెల్యే ప్రవర్తన బాధాకరం
- కడప మేయర్ కె.సురేష్‌బాబు ఆవేదన



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: దేశంలో ఎక్కడా ఏ ఎమ్మెల్యేకు ఇవ్వని విధంగా కడప ఎమ్మెల్యే మాధవికి తమ పాలకవర్గం ఎంతో గౌరవం ఇచ్చిందని, ఆ గౌరవాన్ని ఆమె కాపాడుకోలేకపోయారని కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు అన్నారు. గురువారం కడప కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024 జూలై 4న జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమెను మేయర్‌తో సమానంగా కుర్చీ వేసి కూర్చొబెట్టామని, ఎన్నికల వరకే రాజకీయాలు, ఆ తర్వాత నగరాభివృద్ధి కోసం కలిసి మెలిసి పాటుపడాలని భావించామన్నారు. అయితే ఎమ్మెల్యే వైఖరి అందుకు తగినట్లుగా లేదని, మొదటి సమావేశంలోనే మహిళా కార్పొరేటర్‌ను కించపరిచేలా మాట్లాడి తన అహంభావాన్ని చూపారన్నారు. ఈ ఐదు నెలల కాలంలో ఆమె తమపై, తమ కార్పొరేటర్లపై కక్ష సాధింపు చర్యలకు దిగారన్నారు. తన ఇంటిపై చెత్త వేయించిందని, 8వ డివిజన్ ఇన్‌చార్జి బాలకృష్ణారెడ్డి లే అవుట్‌లో కాలువ ఉందని పట్టుబట్టి ప్రహరీ కూల్చివేయించారన్నారు. కుటుంబ వ్యవహారాల్లో తలదూర్చి 36వ డివిజన్ ఇన్‌చార్జి రఫీని అరెస్టు చేయించారని, ఇలాంటి వ్యక్తికి అంత గౌరవం ఇవ్వడం సరైంది కాదని భావించి చట్టప్రకారం నడుచుకున్నామన్నారు. ఎమ్మెల్యే నగరపాలక సంస్థలో సభ్యురాలు కాదని, ఎక్స్ అఫిషియో సభ్యురాలు మాత్రమేనని తెలిపారు. అందుకే మేయర్‌కు తప్ప మిగిలిన వారందరికీ జీహెచ్‌ఎంసీ నిబంధనల ప్రకారం కిందనే సీట్లను వేయించామని స్పష్టం చేశారు. కార్పొరేషన్ సమావేశంలో తాగునీరు, పారిశుధ్యం, అభివృద్ధి పనులు వంటి ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ఎమ్మెల్యే నేనే రాజు, నేనే మంత్రిగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. కర్నూలులో సాక్షాత్తు మంత్రి టీజీ భరత్ కూడా కార్పొరేటర్లతో పాటు కిందే కూర్చొన్న విషయాన్ని ఉదహరించారు. 400 మంది కార్యకర్తలను వెంటేసుకుని వచ్చి నియంతృత్వ ధోరణిలో దౌర్జన్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. మాకు మనుషులు లేరా....మేమను కుంటే ఎమ్మెల్యేను కార్పొరేషన్‌లోకి రాకుండా గేటు వద్దే ధర్నా చేసేవారం కదా.. అని తెలిపారు.

ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వాళ్ల కాళ్లు పట్టుకోలేదు

మూడు దశాబ్దాలుగా రాజకీయ జీవితంలో ఉన్నా.. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి, మైసూరారెడ్డి, వరదరాజులురెడ్డి వంటి సీనియర్లు ఉన్నప్పుడు టీడీపీకి తొమ్మిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు ఉన్న కాలంలో కూడా ఒక్క ఓటుతో జెడ్పీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యానని, ఏ పార్టీలో ఉన్నా అవతలి పార్టీ వారికి గౌరవమిస్తూ మర్యాద పూర్వకంగా నడుచుకున్నానని మేయర్ కె.సురేష్‌బాబు తెలిపారు. తాను టీడీపీతో కుమ్మక్కయ్యానని ఆ పార్టీ నేత శ్రీనివాసులు రెడ్డి ఆరోపించడం దారుణమన్నారు. తాను మొదటి నుంచి ఒకే పార్టీ, ఒకే సిద్ధాంతాన్ని నమ్ముకున్నానని.. సర్పంచుగా, జెడ్పీ ఛైర్మన్‌గా, మేయర్‌గా ఎన్ని పదవులు వచ్చినా హుందాతనాన్ని వీడలేదన్నారు. వాసు లాగా ఏ పార్టీ అధికారంలో ఉంటే పనుల కోసం ఆ పార్టీ నాయకుల కాళ్లు పట్టుకోవడం తనకు చేతకాదన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు మల్లికార్జున, రామలక్ష్మణ్‌రెడ్డి, చంద్రహాసరెడ్డి, ఆరీఫుల్లా బాష తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

10న స్క్రీనింగ్ పరీక్ష
కడప రూరల్: ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు చేసుకున్న జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నెల 10వ తేదీన స్క్రీనింగ్ పరీక్షను నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి కె. సరస్వతి తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్స్‌ను పొందవచ్చని తెలిపారు.

ఆధార్ సీడింగ్ చేసుకోవాలి
కడప వైఎస్‌ఆర్ సర్కిల్: సంక్షేమ పథకాలకు పోస్ట్ ఆఫీస్‌లో ఆధార్ సీడింగ్ చేసుకోవచ్చని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2.65 లక్షల అకౌంట్లు ఆధార్ సీడింగ్ లేకపోవడం ద్వారా వారికి సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. జిల్లాలోని సచివాలయాల ద్వారా ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్‌ను ప్రారంభించామని వివరించారు. ఐపీపీబీలో అకౌంట్ చేసి ఆధార్ సీడింగ్ చేసుకొని వారు ఈ నెల 15 లోపల తమ ఖాతాకు ఆధార్ సీడింగ్ చేసుకోవాలని కోరారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

జమ్మలమడుగు: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం మైలవరం మండలం తలమంచిపట్నం గ్రామంలో 400 కేవీ సబ్ స్టేషన్ లైన్ విస్తరణ పనుల శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. తొలుత సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తలమంచిపట్నంలో 193 కోట్ల రూపాయలతో 98 ఎకరాల విస్తీర్ణంలో 400 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని పనులను జరగనున్నాయని వెల్లడించారు. ఈ విద్యుత్‌కేంద్రం ద్వారా వైఎస్సార్‌జిల్లా, అనంతపురం జిల్లాలలో ఉత్పత్తి అయ్యే విండ్ పవర్, సోలార్ విద్యుత్ గ్రిడ్స్ అనుసంధానించే పనుల కోసం ఈ రోజు శిలా ఫలకాన్ని ఆవిష్కరించామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేష్‌రెడ్డి, ఆర్డీఓ సాయిశ్రీ,ట్రాన్స్‌కో సీఈ కృష్ణయ నాయుడు, ఎస్ఈలు శ్రీనివాసరావు, విశ్వేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం వద్ద కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆది తదితరులు

వైవీయూలో ‘యువ ఉత్సవ్’
వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో త్వరలో నిర్వహించనున్న ‘యువ ఉత్సవ్’ కార్యక్రమంలో పాల్గొనేందుకు యువత నుంచి ఎంట్రీలు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూయువ కేంద్రం జిల్లా అధికారి కె. మణికంఠ తెలిపారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో వైవీయూలో ఈ యువ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువ ఉత్సవ్‌లో భాగంగా ఇండియా –2047 అన్న అంశంపై పెయింటింగ్, కవిత్వం, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లేమసిన్ విభాగాల్లో వ్యక్తిగత పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా కల్చరల్ ట్రెడిషనల్, ఫోక్, సైన్స్ ఎగ్జిబిషన్ మేళా పోటీలు గ్రూప్, వ్యక్తిగత విభాగాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువత తమ వివరాలను 9177616677 నెంబర్లలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు గ్రంథాలయ ఉద్యోగుల సమావేశం
కడప కల్చరల్: రాష్ట్ర గ్రంథాలయ ఉద్యోగుల ప్రాంతీయ సమావేశం శుక్రవారం కడప నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు నాదెండ్ల బాబ్జి, తుపాకుల సురేష్, నవాబ్‌జాన్, సుబ్రమణ్యం తెలిపారు. ఈ రాయలసీమ ప్రాంతీయ సమావేశంలో కడపతోపాటు అనంతపురం, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన ఉద్యోగులు, నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై చర్చ జరుగుతుందని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం
కడప ఎడ్యుకేషన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులైన డ్రాయింగ్, టైలరింగ్, హ్యాండ్లూమ్, వీవింగ్ కోర్సులో చేరేందుకు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేసు, డీఈఓ మీనాక్షి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇందులో లోయర్ గ్రేడ్‌లో చేరేందుకు కనీసం 7వ తరగతి విద్యార్హత ఉండాలన్నారు. అలాగే హయ్యర్ గ్రేడ్‌కు హాజరుకావాలంటే కచ్చితంగా లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణత పొంది ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డిసెంబర్ 17లోపల తమ దరఖాస్తులను డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని వారు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

- ఇన్‌చార్జ్ ఎస్పీ వాసన విద్యాసాగర్ నాయుడు
- వర్రా రవీంద్రారెడ్డి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

కడప అర్బన్: జిల్లా నలుమూలల నుంచి వచ్చి తమ ఫిర్యాదులను ప్రజలు చెప్పుకునేందుకు వీలుగా ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని జిల్లా ఇన్‌ఛార్జ్ ఎస్పీగా బాధ్యతలను స్వీకరించిన వాసన విద్యాసాగర్ నాయుడు తెలియజేశారు. ఇప్పటివరకు ఎస్పీగా పని చేసిన వి. హర్షవర్ధన్ రాజు ఈనెల 6వ తేదీన సాయంత్రం బదిలీ కాగా.. ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న విద్యాసాగర్ నాయుడు గురువారం సాయంత్రం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీంద్రారెడ్డి కోసం ప్రత్యేక బృందాల ద్వారా గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. వర్రా రవీంద్రారెడ్డిని ఇతర జిల్లా నుంచి వచ్చిన పోలీసులకు అప్పగించడంలో విఫలమైన క్రమంలో చిన్నచౌక్ సీఐగా పనిచేస్తున్న తేజమూర్తిని సస్పెండ్ చేశామని తెలియజేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు సమిష్టిగా కృషి చేయాలనీ జిల్లా ఇన్‌ఛార్జ్ ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రంపోలీస్ అధికారులతో పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎలాంటి సమస్యలు గుర్తించినా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలనీ ఆదేశించారు. సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టివారిపై నిఘా ఉంచాలనీ, అలాంటి పోస్టులు పెట్టిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలనీ ఆదేశించారు. అదనపు ఎస్పీ (పరిపాలన) కె. ప్రకాష్‌బాబు, అదనపు ఎస్పీ (ఏఆర్) బి. రమణయ్య, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సీఐ తేజమూర్తి సస్పెన్షన్


సీఐ తేజమూర్తి (ఫైల్)

కడప అర్బన్ : కకడప నగరం చిన్నచౌక్ పోలీసు స్టేషన్ సీఐ తేజమూర్తిని సస్పెండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డిని పోలీసులు రెండు రోజుల క్రితం తీసుకొచ్చి కడప తాలూకా పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. 41ఏ నోటీసు ఇచ్చి జామీనుపై పంపించారు. ఈ క్ర మంలో వర్రా రవీంద్రారెడ్డిని ఇతర జిల్లాల పోలీసులకు అప్పగించలేదనే నెపంతో చిన్నచౌకు సీఐ తేజమూర్తిని సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విద్యాసాగర్‌నాయుడు గురువారం మీడియా సమావేశంలో ధ్రువీకరించారు.

మాజీ ఎంపీ డీఎన్‌రెడ్డి సతీమణి మృతి


లక్ష్మీదేవమ్మ(ఫైల్)

పులివెందుల టౌన్ : పట్టణంలోని అంకాలమ్మ గుడి ఎదురుగా నివాసముంటున్న మాజీ ఎంపీ దివంగత డీఎన్‌రెడ్డి సతీమణి లక్ష్మీదేవమ్మ (95) అనారోగ్యంతో మృతి చెందారు. హైదరాబాద్‌లోని తన కుమారుడు రమణారెడ్డి వద్ద ఆమె ఆరు నెలలుగా ఉంటున్నారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎంఆర్‌సీ సిబ్బంది జీతాలు విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ఎంఆర్‌సీలలో పనిచేసే సిబ్బంది జీతాలను విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అపార్ నమోదు ప్రక్రియలో జిల్లా ఆరో స్థానంలో ఉన్నప్పటికీ సరైన లక్ష్యాన్ని చేరుకోలేదనే నెపంతో మండల రిసోర్స్ సెంటర్లలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, అలాగే సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతభత్యాలను పెండింగ్‌లో ఉంచడం తగదన్నారు.

అరటి కాయల వ్యాపారి ఐపీ బాంబ్

లింగాల : లింగాల మండలం వెలిదండ్ల గ్రామానికి చెందిన అరటి కాయల వ్యాపారి మల్లికార్జునరెడ్డి సుమారు కోటి రూపాయలపైనే ఐపీ బాంబ్ పెట్టాడు. మండలంలోని వివిధ గ్రామాల రైతుల నుంచి అరటి కాయలను కొనుగోలు చేసి రెండు నెలలుగా అదృశ్యమయ్యాడు. ఈ తరుణంలో ఆయన లాయర్ల ద్వారా సుమారు 20 మంది రైతులకు ఐపీ నోటీసులు జారీ చేశాడు. ఈ క్రమంలో లింగాల గ్రామానికి చెందిన మచ్చుమర్రి చంద్రశేఖరరెడ్డి అనే రైతు నుంచి అరటి కాయలను కొనుగోలు చేసి రూ.7.50 లక్షల డబ్బులు ఇవ్వాలని, మల్లికార్జునరెడ్డి కనిపించలేదంటూ గురువారం లింగాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

తెల్లవారితే పెళ్లిరోజు..
అంతలోనే మృత్యువాత

- రోడ్డు ప్రమాదంలో ఏపీఎస్పీ కానిస్టేబుల్ దంపతుల మృతి
- నేడు పెళ్లిరోజు
- పుట్టింటి నుంచి కొత్త దుస్తులు తీసుకొస్తుండగా దుర్ఘటన



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ శివశంకర్, శైలజ

వల్లూరు : ఆ దంపతులకు పన్నెండేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. ఈనెల 8వ తేదీ శుక్రవారం వారి పెళ్లి రోజు. ఈ నేపథ్యంలో పుట్టింటి నుంచి కొత్త దుస్తులు తీసుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలిద్దరూ దుర్మరణం చెందారు. ఈ విషాద సంఘటన కడప – తాడిపత్రి ప్రధాన రహదారిపై వల్లూరులోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా..

కడప నగరంలోని ప్రకాష్ నగర్‌కు చెందిన జానా శివ శంకర్(40) భాకరాపేటలో ఏపీఎస్పీ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఆయన గురువారం తన సతీమణి శైలజ(34)తో కలిసి ద్విచక్ర వాహనంలో కమలాపురం మండల పరిధిలోని చదిపిరాళ్ల గ్రామంలోని అత్తగారి ఇంటికి వెళ్లాడు. తిరిగి కడపకు వస్తుండగా వల్లూరు సమీపంలో కడప వైపు నుంచి ఎర్రగుంట్ల వైపు ప్రయాణిస్తున్న కంటైనర్ లారీ ఢీకొంది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. తీవ్ర రక్తస్రావం కావడంతో శైలజ అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన శివ శంకర్‌ను చికిత్స కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతులకు 8 సంవత్సరాలు, 12 సంవత్సరాల వయసు గల ఇద్దరు పిల్లలున్నట్లు స్థానికులు తెలిపారు. శివ శంకర్, శైలజ దంపతులకు శుక్రవారం పెళ్లి రోజు కావడంతో ఆమె అమ్మగారింటి ఆహ్వానం మేరకు వెళ్లి వారు పెట్టిన కొత్త దుస్తులు తీసుకుని తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. కొత్త దుస్తులతో సంతోషంగా పెళ్లిరోజును జరుపుకోవాల్సిన దంపతులు అర్ధంతరంగా తనువు చాలించడం అందరినీ కంట తడి పెట్టించింది. సంఘటన స్థలంలో పడి ఉన్న కొత్త దుస్తులతో కూడిన బ్యాగును చూసిన వారి హృదయాలు బరువెక్కాయి.

వేడుకగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం

డైమండ్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ర్యాలీ


భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ర్యాలీని ప్రారంభిస్తున్న అతిథులు

కడప స్పోర్ట్స్ : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని గురువారం కడప నగరంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ భారీ ర్యాలీ నిర్వహించారు. కడప నగరం శంకరాపురంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ కార్యాలయంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటై 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా డైమండ్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ప్రారంభించిన స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వారసత్వాన్ని భావితరాలకు అందించాలన్నారు. జిల్లా రేంజర్ కమిషనర్, వైవీయూ సహ ఆచార్యులు డాక్టర్ కె. లలిత మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కోర్సులు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. మైనార్టీ శాఖ ఈడీ డాక్టర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి విద్యార్థులకు సమాజం పట్ల బాధ్యత పెంచడంతో పాటు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ముందుందన్నారు. కడప ఎంఈఓ గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు స్కౌట్స్ అండ్ గైడ్స్ అందించే సేవలు ఎంతో విలువైనవన్నారు. జిల్లా జాయింట్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, జిల్లా అసిస్టెంట్ కమిషనర్లు గునిశెట్టి శ్రీనివాసులు, రెహమాన్, జిల్లా యూత్ కమిటీ చైర్మన్ వెంకట జనార్దన్‌రెడ్డి, ఏఎస్ఓసీ లక్ష్మీకర్ మాట్లాడారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్లు ఓబయ్య, రాజేష్, గైడ్‌కెప్టెన్‌లు హసీనా, రూతు, సునీత, రమణమ్మ, సంతోషికుమారి, ప్రమీల, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ శిక్షణను రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న లీడర్‌షిప్, ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాలను రెసిడెన్షియల్ పద్ధతిలో రద్దు చేయాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడప నగరంలోని జిల్లా కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను రద్దు చేసి నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో మాత్రమే జరిగే విధంగా చూడాలన్నారు. ఈ శిక్షణ కారణంగానే రత్నకుమార్ అనే ప్రధానోపాధ్యాయుడు ఒత్తిడికి గురై మరణించారన్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు జిల్లా కార్యదర్శి ఆలమూరు ప్రసాద్, రవిశంకర్, సలాం శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన నిధులను చెల్లించాలి


డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న పీఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర వ్యాప్తంగా మే నెలలో నిర్వహించిన పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలకు సంబంధించి విధులు నిర్వహించిన సిబ్బందికి వెంటనే నిధులు చెల్లించాలని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(పీఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం డీఈఓ మీనాక్షిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సప్లమెంటరీ పరీక్షల విధులను నిర్వహించిన సిబ్బందికి నిధులను చెల్లించారన్నారు. కానీ వైఎస్సార్ జిల్లాలో ఇంతవరకు చెల్లించలేదన్నారు. ఇందుకు సంబంధించిన నిధులు మంజూరై 15 రోజులు అవుతున్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

క్రీడాపాఠశాలను సందర్శించిన శాప్ చైర్మన్


క్రీడాకారులతో మాట్లాడుతున్న శాప్ చైర్మన్, ఎమ్మెల్యే

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్ ఎ. రవినాయుడు, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవిరెడ్డితో కలిసి గురువారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా వారు పాఠశాల సిబ్బంది, కోచ్‌లు, క్రీడాకారులతో సమావేశమయ్యారు. అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడాపాఠశాలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పలు సమస్యలను చైర్మన్‌కు వివరించగా, వాటన్నింటినీ త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి కె. జగన్నాథరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి, ఆర్. శ్రావణ్‌రాజ్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హాస్టల్ నిర్వహణపై అసంతృప్తి..

క్రీడా పాఠశాలలోని వసతి గృహాలు, వంటశాల, భోజనశాలను శాప్ చైర్మన్ పరిశీలించారు. చాలాచోట్ల ఫ్యాన్‌లు పనిచేయకపోవడం, స్విచ్‌బోర్డులు లేకపోవడం, లైట్లు వెలగకపోవడం, టాయిలెట్ల నిర్వహణ అధ్వానంగా ఉండటంతో ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. భోజనంలో సైతం నాణ్యత లోపించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

సస్య రక్షణ చేపట్టండి

– జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

మైదుకూరు : జొన్న, మినుము పంటల్లో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు అన్నారు. మైదుకూరు మండలంలోని శివపురం రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ కత్తెర పురుగు నివారణకు డెలిగేట్ లేదా బారజైడ్ 2.5 ఎం.ఎల్. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఆముదం, బంతి లాంటి ఎర పంటలను జొన్న, మొక్క జొన్నలలో చుట్టూ కంచె పంటగా వేసుకోవాలన్నారు. అనంతరం జొన్న, మినుము పంటలను పరిశీలించారు. మైదుకూరులోని ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌ను సందర్శించారు. ఏడీఏ కృష్ణమూర్తి, ఏఓ పి.లక్ష్మీప్రసన్న, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

జ్యూస్ సెంటర్‌లో చోరీ

పులివెందుల రూరల్ : పట్టణంలోని పాత బస్టాండ్ సత్రంబడి పాఠశాల సమీపంలో ఉన్న ముంబై జ్యూస్ సెంటర్‌లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి 10.30 గంటలకు జ్యూస్ సెంటర్‌కు తలుపులు వేసి ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత దుండగులు జ్యూస్ సెంటర్ తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించి పండ్లతోపాటు రూ.5వేల నగదును అపహరించుకెళ్లారని బాధితుడు తెలిపారు. మెయిన్ బజార్‌లోనే చోరీలు జరుగుతుండటంతో పట్టణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

నిప్పంటించుకుని మహిళ ఆత్మహత్య


మృతి చెందిన రాజేశ్వరి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం బ్రాహ్మణపల్లి రోడ్డులోని ఎస్టీబీఐ నగర్ విజయమ్మ కాలనీలో నివాసముంటున్న యాదవకుంట రాజేశ్వరి (48) అనే మహిళ గురువారం నిప్పంటించుకుని మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందులకు చెందిన సదాశివారెడ్డితో ఆమెకు 30 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజేశ్వరి గత పదేళ్ల నుంచి మానసిక సమస్యలతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో గురువారం జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిప్పంటించుకుంది. భర్త ఇంటికి వచ్చి చూడగా బాత్రూం సమీపంలో మంటలు వస్తుండటంతో అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు. చికిత్స కోసం ఆమెను 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో కడపకు సిఫార్సు చేశారు. కడపకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

క్రికెట్ టోర్నీలో బ్యాట్స్‌మన్ జోరు


డింకూ రామ్‌చరణ్, అనంతపురం (126 పరుగులు)


వివేకానంద, శ్రీకాకుళం (178 పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 క్రికెట్ పోటీల్లో బ్యాట్స్‌మన్ సత్తా చాటారు. వైఎస్ఆర్ఆర్–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో గుంటూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గుంటూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 89.3 ఓవర్లలో గుంటూరు జట్టు 276 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని డింకూ రామ్‌చరణ్ 126 పరుగులతో రాణించాడు. అభినవ్ డేవిడ్ 48 పరుగులు చేశాడు. అనంత బౌలర్ రోహిత్ 4 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

చెలరేగిన సిక్కోలు జట్టు..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో శ్రీకాకుళం, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన శ్రీకాకుళం జట్టు 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 447 పరుగులు చేసింది. జట్టులోని ఎస్.వి.ఎస్. వివేకానంద 151 బంతుల్లో 27 ఫోర్లు, 1 సిక్సర్‌తో 178 పరుగులు చేశాడు. ఈయనకు జతగా నేత్రా కిరణ్ 75 పరుగులతో రాణించాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విజయనగరం, కృష్ణా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కృష్ణా జట్టు 78.3 ఓవర్లలో 286 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని భానుచంద్ యాదవ్ 75 పరుగులు, తమన్‌సాయి 60 పరుగులు చేశారు. విజయనగరం బౌలర్లు మణిధర్మతేజ 2, జహీరుద్దీన్ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 23 పరుగులు చేసింది.

అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు

జేసీ అదితిసింగ్



కడప సెవెన్‌రోడ్స్ : దీపం పథకం–2 ద్వారా అర్హత ఉన్న ప్రతి వినియోగదారుని ఇంటికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో దీపం పథకం–2 పై ఆమె మీడియాతో మాట్లాడారు. గత నెల 31వ తేదీ నుంచి దీపం పథకం–2 రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించామన్నారు. ఈ పథకం కింద సంవత్సరంలో అర్హత కలిగిన వినియోగదారునికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. మూడు గ్యాస్ సిలిండర్లను అర్హత గల వినియోగదారులకు మూడు బ్లాకులుగా చేసి పంపిణీ చేస్తామన్నారు. ఏప్రిల్ నుంచి జూలై మాసం వరకు ఒక బ్లాకుగా, ఆగస్టు మాసం నుంచి నవంబర్ మాసం వరకు మరో బ్లాక్ ఉందన్నారు. అలాగే డిసెంబర్ మాసం నుంచి 2025 మార్చి వరకు మూడో బ్లాక్ ఉందని చెప్పారు. అర్హత గల వినియోగదారులందరికీ ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించామని చెప్పారు. అర్హత కలిగి ఉండి కూడా ఫోన్ లేకపోయినా వారిని కూడా అర్హులుగానే ఉంటారన్నారు. ఈ పథకం కింద నియమ నిబంధనల మేరకు వినియోగదారుడు ఆధార్ నంబరు, బియ్యం కార్డు, యాక్టివ్ ఎల్పీజీ కనెక్షన్ కలిగి ఉండాలన్నారు. అదర్ డిపార్టుమెంట్ డాటా బేస్‌తో కూడా మ్యాచ్ అయి ఉండాలన్నారు. గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసినప్పటికీ గ్యాస్ సబ్సిడీ మొత్తం ఖాతాలలో జమ కాని పరిస్థితి ఉంటే సంబంధిత గ్యాస్ ఏజెన్సీ వారు వెంటనే దానిని పరిష్కరిస్తారన్నారు. కొంతమందికి అర్హత ఉన్నప్పటికీ ఈకేవైసీ జరగకుండా ఉండటే గ్యాస్ డెలివరీ బాయ్ వినియోగదారుల నుంచి ఈకేవైసీ తీసుకోవాలన్నారు.

అక్రమాలకు సహకరించలేదనే ఎస్పీ బదిలీ

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వెఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యేలు, నేతల అక్రమ ఆదాయాలకు సహకరించడం లేదనే కారణంతోనే జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును ఉద్దేశ పూర్వకంగా బదిలీ చేయించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక పోరెడ్డి నరసింహారెడ్డి స్వగృహంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు వంద మంది మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు జరిగినా స్పందించని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీడీపీ నేతలు చెప్పిన వెంటనే నిజాయితీపరుడైన ఎస్పీ హర్షవర్ధన్ రాజును బదిలీ చేయడం విచారకరమన్నారు. కేవలం జిల్లాకు వచ్చిన నాలుగు నెలల్లోనే ఎస్పీని తిరిగి పంపారన్నారు. నిబంధనల ప్రకారం రెండేళ్ల వరకు విధులు నిర్వహించాల్సి ఉందని.. లంచగొండి, అవినీతిపరుడు, శాంతి భద్రతల పరిరక్షణలో విఫలం కావడం లాంటివి జరిగినప్పుడే ఎస్పీని బదిలీ చేస్తారన్నారు. ఇవేమీ లేకుండా ఇసుక అక్రమ రవాణాకు, జూద నిర్వహణకు, భూ కబ్జాలకు, సెటిల్‌మెంట్లకు సహకరించడం లేదన్న కారణంతోనే ఎస్పీని బదిలీ చేశారని ఆరోపించారు. కొత్తగా వచ్చే ఎస్పీకి ప్రభుత్వమే అన్నీ నేర్పించి పంపుతుందని, జిల్లాలో ఇక ప్రతిపక్ష పార్టీకి స్వేచ్ఛ ఉండదన్నారు. ఇక జిల్లాలో టీడీపీ నేతల అరాచకాలకు అడ్డే ఉండబోదని రాచమల్లు స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు లావణ్య, గరిశపాటి లక్ష్మీదేవి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, జయంతి, ఎంపీపీ శేఖర్ యాదవ్, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, బీఎస్ఆర్, తొగటవీరక్షత్రియ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చౌడం రవీంద్ర పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి


క్రీడాకారులకు మెమెంటోను అందిస్తున్న టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్ కిరణ్ తదితరులు

పులివెందుల టౌన్ : జాతీయ స్థాయిలో పతకాలు సాధించడమే లక్ష్యంగా ఆడాలని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్ కిరణ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా ప్రాంగణంలో సాఫ్ట్ టెన్నిస్ బాలుర క్రీడా పోటీలు ముగిశాయి. బహుమతి ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలపట్ల ఆసక్తి కనబరిచినప్పుడే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలరన్నారు. కార్యక్రమంలో రిటైర్డు పీఈటీ డి.వి.కొండారెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి అరుణకుమారి, లోకల్ ఆర్గనైజర్ ఎం.శ్రీకాంత్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ సాజిద్, పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

68వ జాతీయ స్థాయి సాఫ్ట్ టెన్నిస్ క్రీడా పోటీలకు క్రీడాకారులు ఎంపికై నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్ కిరణ్ తెలిపారు. అండర్–14 బాలుర విభాగంలో ఈశ్వర్ హితేష్ , దర్శన్‌రెడ్డి, తంజిత్ (కృష్ణా జిల్లా), జ్ఞానేశ్వర్‌రెడ్డి (అనంతపురం), యోజిత్‌నాథ్ (వైఎస్సార్), ఎంఎస్‌డీ సాత్విక్(పశ్చిమగోదావరి), వంశీ(చిత్తూరు), హేమశేఖర్(గుంటూరు) ఎంపికయ్యారు. అండర్–17 బాలుర విభాగంలో గౌస్ మోదీన్, వేదాంత్ శ్రీనివాస్, అర్జున్ సాయి (కృష్ణా జిల్లా),ఉమర్, ముని హేమసాయి, జీవన్ (చిత్తూరు), రవినందన్ (నెల్లూరు) ఎంపికయ్యారు. అండర్–19 బాలుర విభాగంలో అక్బర్ అహ్మద్, చరణ్ కుమార్, జీవన్, గౌతమ్ (గుంటూరు), రేవంత్, సూర్య తేజశ్విని (కృష్ణా జిల్లా),నాని, ఆకాష్ (తూర్పుగోదావరి), సాయితేజారెడ్డి (నెల్లూరు) ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

అక్రమ కేసులో వైఎస్సార్‌సీపీ నేతల అరెస్టు

అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్న పోలీసులు


శివరాం, రామాంజనేయులును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : మైదుకూరు మండలం పెద్దశెట్టిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నేట్లపల్లె శివరాం, మండల నాయకుడు నేట్లపల్లె రామాంజనేయుల్ని బుధవారం అర్ధరాత్రి పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. వారిద్దరిపైనా హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మైదుకూరు మండలం నంద్యాలంపేటలోని 1910 సర్వే నంబర్‌లోని 7 ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉందని, ఆ విషయాన్ని సూచిస్తూ తాము ఆ భూమిలో బోర్డును పాతగా నేట్లపల్లె శివరాం, రామాంజనేయులు పీకేశారని తహసీల్దార్ వి.రాజసింహ నరేంద్ర ఈ నెల 2న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిని పరిశీలించేందుకు తమ సిబ్బంది అక్కడికి వెళ్లగా వారిద్దరూ దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బుధవారం అర్ధరాత్రి వారిద్దరినీ అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరినందునే..

నేట్లపల్లె శివరాం, రామాంజనేయులు అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. నంద్యాలంపేటలో టీడీపీ నాయకులు రిగ్గింగ్‌కు పాల్పడకుండా అడ్డుకున్నందుకే వారిద్దరిపై కక్ష సాధించేందుకు అక్రమ కేసులు బనాయించారని తెలుస్తోంది. గురువారం ఉదయం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అర్బన్ సీఐ సయ్యద్ హాషంతో మాట్లాడారు. ఎందుకు వారిపై కేసు నమోదు చేశారు, ఎఫ్ఐఆర్ ఉందా అని అడిగారు. ఎఫ్ఐఆర్ రాశామని చెబుతూనే సీఐ దానిని ఇవ్వకపోవడం గమనార్హం. కాగా.. బాధితులు శివరాం, రామాంజనేయులు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో మాట్లాడుతూ.. తహసీల్దార్ చెబుతున్న భూమిని తాము చూడలేదని, భూకబ్జా చేయలేదని కన్నీటిపర్యంతమయ్యారు. తమపై కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆయనకు బంధువైన తహసీల్దార్‌తో ఇదంతా చేయిస్తున్నారని ఆరోపించారు.

ముమ్మాటికీ అక్రమ కేసే

నేట్లపల్లె శివరాం, రామాంజనేయులుపై పోలీసులు బనాయించిన కేసు ముమ్మాటికీ అక్రమమేనని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మీడియాతో చెప్పారు. రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోందని ధ్వజమెత్తారు. తహసీల్దార్ ఫిర్యాదు చేస్తే విచారించకుండానే పోలీసులు కేసు నమోదు చేయడం శోచనీయమని ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. దువ్వూరు, చాపాడు ఎంపీపీలు జయచంద్రారెడ్డి, లక్ష్మయ్య, పార్టీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, మైదుకూరు మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, మునిసిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, కోఆప్షన్ సభ్యుడు ట్రాక్టర్ గౌస్ తదితరులు పోలీసుల చర్యను ఖండించారు.